క్లుప్తంగా

సీఐలు బాధ్యతల స్వీకరణ


మజ్జి అప్పల నాయుడు


పి.సునీల్ కుమార్

కాకినాడ క్రైం: కాకినాడ డివిజన్ పరిధిలో నగరంలో రెండు స్టేషన్లలో ఇద్దరు సర్కిల్ ఇన్స్పెక్టర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ టూ టౌన్ పీఎస్ సీఐగా మజ్జి అప్పల నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈయన స్వస్థలం శ్రీకాకుళం కాగా ఈయన 2009 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన వారు. ఎస్ఐగా తొలి పోస్టింగ్ కోటనందూరులో పొంది ముమ్మిడివరం, ఏలేశ్వరంలలో పనిచేశారు. 2021 మేలో సీఐగా పదోన్నతి పొందిన ఆయన చింతూరు, కాకినాడ త్రీ టౌన్ క్రైం సీఐగా పనిచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీసీఆర్‌బీలో పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా కాకినాడ టూ టౌన్‌కు వచ్చారు. కాకినాడ పోర్టు పీఎస్ సీఐగా పి.సునీల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 1998 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన ఉమ్మడి కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరిలో పనిచేశారు. 2012లో సీఐగా పదోన్నతి పొంది విజయవాడ సిటీలో టూ టౌన్, సీసీఎస్, క్రైం, ట్రాఫిక్‌లో పశ్చిమగోదావరిలో భీమవరం, పెనుగొండ, కొవ్వూరులో పనిచేశారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో ఏలూరు, కాకినాడలలో చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ పోర్టు పీఎస్ బాధ్యతలు చేపట్టారు.

యంగ్‌మైండ్స్ సేవలు అభినందనీయం


ఆర్మీ జవాన్లను సత్కరిస్తున్న నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి

బాలాజీచెరువు: సామాజిక సేవలో యంగ్‌మైండ్స్ సేవలు అభినందనీయమని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి పేర్కొన్నారు. తలసేమియా చిన్నారుల కోసం యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాన్ని కాకినాడ నగర, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సందర్శించగా అధిక సంఖ్యలో యువత హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం మాజీ సైనికులు, ఆదర్శ రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ (చిన్నా) సేవలను వారు అభినందించారు. కార్యక్రమంలో నల్లమిల్లి సుగుణారెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం


పెనుగుదురులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కరప: దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. పెనుగుదరు, నడకుదురు తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి సిబ్బందితో కలసి పర్యటించి దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మైక్ అనౌన్స్‌మెంట్ చేసి, అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు కానీ, అపరిచితులు కానీ సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా గ్రామం విడిచి ఎక్కడికైనా శుభకార్యాలకు, పుణ్య తీర్థాలకు వెళితే పోలీసులకు తెలియజేస్తే మీ ఇంటిలో ఎల్‌హెచ్‌ఎంఎస్ అమర్చడం జరుగుతుందన్నారు. ఇంటిలో విలువైన వస్తువులుంటే లాకర్‌లో ఉంచుకోవాలన్నారు. మండల పరిధిలో దొంగతనాలు జరగకుండా ముందస్తు సమాచారం పోలీసులకు తెలియజేసి, ప్రజలు సహకరించాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

కరప: రెండు వర్గాల వారు పరస్పరం ఘర్షణ పడడంతో వారిచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన అడబాల మంగ తన కుమార్తె ఆచంట భవానీ గృహంలో ఉంటోంది. మంగ మనవడు శివకుమార్ గురువారం రాత్రి ఇంటి బయట మోటార్‌సైకిల్‌పై కూర్చుని ఉండగా ఒక కారు వచ్చి ఢీ కొట్టింది.

అక్కడి వారు డ్రైవర్ సురేష్‌ను నిలదీయడంతో జరిగిన విషయాన్ని, తనయజమాని అడబాల రాజాబాబుకు తెలిపాడు. రాజాబాబు కోపంగా వచ్చి రాడ్‌తో మంగపై దాడిచేసి గాయపరిచాడు. దీనిపై మంగ కుటుంబీకులు కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాత గొడవలతో కారులో భార్య, పిల్లలతో వస్తున్న తనపై ఆచంట శివకుమార్ దాడి చేసినట్టు రాజాబు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల వారి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు
- అమ్మవారి దర్శనాలకు భక్తులతో కిటకిట
- వరలక్ష్మీ వ్రతాలు ఆచరించిన ముత్తైదువలు

బోట్‌క్లబ్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలో పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఇంటి వద్ద వరలక్ష్మి పూజ చేసుకున్న మహిళలు సాయంత్రం అమ్మవారి దర్శనం కోసం ఆలయాలకు రావడంతో నగరంలో పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో భారీగా క్యూలైన్‌లు పెరిగిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకూ భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి గర్భాలయాన్ని వివిధ రకాల పువ్వులతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకొని మహిళలు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.20, రూ.30 క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. ఉచిత దర్శనం కోసం గంట తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక సంతచెరువు మార్కెట్‌లోని కనకదుర్గ అమ్మవారు శ్రావణ శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. దీంతో ఆలయ పరసరాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు.


బంగారు చీరలో కాకినాడ బాలా త్రిపుర సుందరి అమ్మవారు

ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక శారదాదేవి ఆలయంలోను, ద్వారకానగర్‌లోని కనక మహాలక్ష్మి అమ్మవారి అలయంలో భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

కరప: మండలంలో గ్రామ గ్రామాన శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. మహిళలు వేకుజామునే లేచి మంగళస్నానమాచరించి, వరలక్ష్మీదేవిని రంగురంగుల పుష్పాలతో అలంకరించి, రకరకాల పిండివంటలు నైవేద్యంగా సమర్పించి, బంగారు లక్ష్మీదేవి రూపు, నూతన వస్త్రాలను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కరప, పాతర్లగడ్డ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, కూరాడ, కొంగోడు, నడకుదురు, పెనగుదురు, అరట్లకట్ట, వేములవాడ, వలసపాకల తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలు, పెనుగుదురులోని సంతోషి మాత ఆలయం, కరప విష్ణ్వాలయం, యండమూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


బాలా త్రిపుర సుందరి అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప విష్ణ్వాలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, యండమూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లను అందంగా అలంకరించి, అర్చకులు పెద్దింటి సీతారామం పూజాదికాలు నిర్వహించారు. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


కరపలోని దుర్గాదేవి అమ్మవారు

వరాలమ్మా కరుణించమ్మా

- వాడవాడలా అమ్మ నామస్మరణమే..
- శ్రీపీఠంలో ఘనంగా కుంకుమ పూజలు

కాకినాడ రూరల్: తమ ఇంట లక్ష్మీ దేవి కొలువుండాలని కోరుకుంటూ మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచారించారు. వేకువ జామునే నిద్ర లేచి తలారాస్నానమాచరించి, పిండి వంటలు, పండ్లు, పత్రి, వరలక్ష్మి ప్రతిమ గల బంగారు రూపును అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేసుకున్నారు. అనంతరం ముత్తైదువులను పిలిచి తాంబూలు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఆలయాలను దర్శించుకునేందుకు తరలివెళ్లడంతో సందడి నెలకొంది. రమణయ్యపేట శ్రీపీఠంలో శుక్రవారం ఉదయం కుంకుమ పూజలు జరిపించడంతో అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.


రమణయ్యపేట శ్రీపీఠంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సభ్యుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బోట్‌క్లబ్: సభ్యులందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ప్రధాన ఉద్దేశంతో ఏటా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షుడు నానాజీ అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులతో గుండె, చర్మ, కంటి, దంత వైద్యులతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్టు తెలిపారు. దీనితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. సభ్యుల సహకారంతో విద్య, వైద్య, క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తూ కమిటీ ఆశయాలను నెరవేరుస్తున్నామన్నారు. కమిటీ కార్యదర్శి పాబోలు చినవున్నయ్య మాట్లాడుతూ వాసన్ ఐ కేర్, క్లోవ్ డెంటల్ ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరాన్ని నిర్వహించగా సుమారు 675 మంది పరీక్షలు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు జీవై రఘునాథ్, కోశాధికారి ఎం .సూర్యనారాయణ రాజు, కమిటీ సభ్యులు సుసర్ల సుబ్రహ్మణ్యం, బచ్చు శివప్రసాద్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీఎం స్వనిధి లక్ష్యాలు సాధించాలి

కమిషనర్ భావన

కాకినాడ: స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంజూరు చేసే రుణాలు, వీధి వ్యాపారులు, చిన్న తరహా వ్యాపారాలు చేసుకునే వారికి పీఎం స్వనిధి పథకం ద్వారా అందజేసే రుణాల లక్ష్యాన్ని పూర్తి చేసేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన మెప్మా అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనర్ తన చాంబర్‌లో మెప్మా అధికారులతో వివిధ పథకాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు అందజేయాల్సిన రుణ లక్ష్యాలపై చర్చించారు. బ్యాంకు లింకేజీకి సంబంధించి ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి వెయ్యి సంఘాలకు రూ.40 కోట్ల లక్ష్యం కాగా, ఆగస్టు 2024 నాటికి 362 సంఘాలకు రూ.41.41 కోట్ల లక్ష్యానికి చేరుకున్నామని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏవో ప్రసాద్, ఇన్‌చార్జి టీపీఆర్‌ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.


మెప్మా అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ భావన

ఉపాధ్యాయ ఓటర్ల జాబితా నవీకరించండి

ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయ ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఇట్ల కిషోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కాకినాడ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియపై ఆయన అన్ని మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా నవీకరణపై గత నెల 29న నోటిఫికేషన్ జారీ చేశారని, ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. నూతన ఉపాధ్యాయ ఓటరు నమోదుకు ఓటర్లు ఫారం–19 సమర్పించడానికి 2024 సెప్టెంబర్ 3 చివరి తేదీ అని ఆయన అన్నారు. సెప్టెంబర్ 24న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ, ఆ జాబితాపై క్లెయిములు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు 2024 సెప్టెంబర్ 24 నుంచి అక్టోబరు 15 వరకు అవకాశం ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన క్లెయిములు, అభ్యంతరాలను అక్టోబర్ 30వ తేదీ నాటికి పరిష్కరించి, తుది ఓటర్ల జాబితాను 2024 నవంబర్ 6న ప్రచురించడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులందరికీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఏఈఆర్‌ఓలు అవకాశం కల్పించాలని, అనర్హులు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితాలో నమోదు కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అందిన ప్రతి క్లెయిము, అభ్యంతరాన్ని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆర్డీవో సూచించారు. సమావేశంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి పితాని త్రినాథరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎం అసోసియేషన్, యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీయూఎస్ ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధుల పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఇట్ల కిశోర్

నేడు పరదేశమ్మ అమ్మవారి జాతర

తాళ్లరేవు: కోరిన కోర్కెలు తీర్చే తాళ్లరేవు గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి పెద్ద జాతర మహోత్సవం శనివారం రాత్రి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నెల రోజుల క్రితం అమ్మవారిని మార్కెట్ వీధిలోని అంగన్ గుడిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారి జాతర, ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

పబ్బినీడి పాఠశాలకు దాతల విరాళాలు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు రూ.60 వేల విరాళాలు ఇచ్చినట్టు హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. పాఠశాలకు శాశ్వతనిధి ఏర్పాటు చేస్తున్నట్టు స్వాతంత్ర్య దినోత్సవం రోజున చెప్పగా గ్రామంలోని దాతలు ఈ మేరకు స్పందించారు. గురజనాపల్లికి చెందిన కర్నాసుల పురషోత్తమరావు రూ.25 వేలు, పబ్బినీడి వెంకటకృష్ణ రూ.25 వేలు, మాగాపు గోవిందరాజులు రూ.10 వేలు ఇచ్చారన్నారు. ఇంకా దాతలు నుంచి వచ్చిన విరాళాలను బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తామన్నారు. విరాళాలపై వచ్చిన వడ్డీ సొమ్మును జాతీయ పండగలకు, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించేందుకు, జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు, రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, వీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం


ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ భావన

- కమిషనర్ భావన
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే అభ్యర్థనలను నిశితంగా పరిశీలించడంతో పాటు వాటి పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కార ప్రగతిపై వివిధ విభాగాధిపతులతో ఆమె సమావేశమయ్యారు. ఆయా వినతులను స్వీయ పరిశీలన చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అర్జీలపై వెంటనే స్పందించి, గడువులోపల స్పష్టమైన వివరణ అర్జీదారునకు అందించి వీలైనంత సంతృప్త స్థాయిని పెంపొందించాలని తెలిపారు. సమావేశంలో ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం ఏసు బాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ ఎస్ఈ ఎం.వెంకటరావు, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

కాకినాడ/కాకినాడ రూరల్: పేదల ఆకలి తీర్చేందుకే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో వివేకానంద పార్కు వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన అన్న క్యాంటీన్‌లోని ఏర్పాట్లను పరిశీలించారు. కాగా బోట్‌క్లబ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావుతో కలసి, సంత చెరువు, డెయిరీ ఫారమ్, అన్నమఘాటీ సెంటర్ వద్ద అన్న క్యాంటీన్లను సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, స్మార్ట్ సిటీ, ఇంజినీరింగ్, ఆరోగ్యశాఖల అధికారులు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి భోజనాన్ని వడ్డిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కమిషనర్ భావన

సుప్రీం తీర్పుపై 21న భారత్ బంద్

సమావేశమైన మాల మహానాడు జేఏసీ నేతలు

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21న బుధవారం వివిధ ప్రజా, దళిత సంఘాలు సంయుక్తంగా భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్టు మాల మహానాడు జేఏసీ నాయకులు తెలిపారు. నడిపూడి డాబా గార్డెన్‌లో మాల మహానాడు జేఏసీ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. బంద్‌కు అన్ని వర్గాలు, చాంబర్ ఆఫ్ కామర్స్, విద్యాసంస్థలు, దుకాణదారులు, వాహన యూనియన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు సహకరించాలని జేఏసీ నాయకులు పండు అశోక్‌కుమార్, ఎం ఏకే భీమారావు, జగడం సత్యనారాయణ, జల్లి శ్రీనివాసరావు, ఉండ్రు బాబ్జీ కోరారు. వర్గీకరణ జరగకుండా ఉద్యమానికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చీకురుమిల్లి కిరణ్‌కుమార్, పెయ్యల పరశురాముడు, పోతుల నాగరాజు, నాతి శ్రీనివాస్, నక్కా సంపత్‌కుమార్, కుంచే బాబులు, బొంతు రమణ, మెండు రమేష్, గెల్లా రాజేంద్ర, ఉబ్బన శ్రీను, మోకా శ్రీను, ఉటాల వెంకటేష్ సాధనల శ్రీను, మెండి డేవిడ్, పోతుమూడి రవికుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

ఎస్పీకి ఫిర్యాదు చేశా..

కాకినాడ క్రైం: మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులపై జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశానని కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు శుక్రవారం మీడియాకు తెలిపారు. గడచిన ఐదేళ్లలో అనేక అరాచకాలు జరిగాయనీ, ఆ సమయంలో సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు లేవన్నారు. ప్రతిపక్షాలపై దాడులు చేశారని, నాయకులపై పరుష పదజాలంతో విమర్శలు చేశారనీ, టీడీపీ కార్యాలయంలో సమావేశంలో ఉన్న తమపై దాడికి పాల్పడ్డారనీ, పలువురి ఇళ్లు కూల్చారనీ, సినిమా రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. అప్పటి ఫిర్యాదులను తిరగతోడి చర్యలు చేపట్టాలని కోరినట్లు వెంకటేశ్వరరావు శుక్రవారం వెల్లడించారు.

ముంగర్లమ్మ జాతర ప్రారంభం


వేలంకలో ముంగర్లమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

కిర్లంపూడి: వేలంకలో వేంచేసిన ముంగర్లమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పొన్నులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 72 సంవత్సరాలుగా అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 24న అమ్మవారి ఆలయం వద్ద జగారం, 25న గ్రామాల్లో పండగ, 26న భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

చోరీల నియంత్రణపై అవగాహన సదస్సులు

తాళ్లరేవు: సమాజంలో అధికమైన దొంగతనాలు, దోపిడీలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ కోరంగి పోలీసులు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు కాకినాడ డీఎస్పీ, కాకినాడ రూరల్ సీఐల ఆధ్వర్యంలో కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ అవగాహన కల్పించారు. శుక్రవారం కోరంగి పంచాయతీ గుడ్డివాని తూము సెంటర్‌లో వ్యాపారులు, ఆటోడ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రావణ మాసం, పెళ్లిళ్ల అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. ఇంటికి తాళాలు వేసేటప్పుడు బయటకు కనిపించకుండా జాగ్రత్త పడాలని, బంగారు వస్తువులు వాడుకకు ఉంచుకుని, మిగిలినవి లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. ఎస్సైతో పాటు, సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

తాళ్లరేవు: కొత్త ఎంపీడీఓగా ఎం.అనుపమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాళ్లరేవులో పనిచేసిన ఆమె సార్వత్రిక ఎన్నికల ముందు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం తిరిగి ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఎంపీపీ రాయుడు సునీత, కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ, ఈఓపీఆర్డీ ఎం.భైరవమూర్తి, పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.